క్లుప్తంగా

రింతాడలో గ్రామసభ

గూడెంకొత్తవీధి: రింతాడలో పీ4 గ్రామసభను బుధవారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుపేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు

చట్టాలపై అవగాహన



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు గిరిజన హక్కులు, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్‌ఎం సత్యనారాయణరాజు, వార్డెన్ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా విద్యార్థి ఆరోగ్యం



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థి సత్తిబాబు

కొయ్యూరు: విద్యార్థి మర్రిశెట్టి సత్తిబాబు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ బుధవారం తెలిపారు. విశాఖలోని కేజీహెచ్‌లో ట్రైబల్‌సెల్ ఆధ్వర్యంలో చిన్నారికి మెరుగైన వైద్యం అందించారని చెప్పారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిగా నయం అయిన వెంటనే బాలుడిని డిశ్చార్జి చేస్తారన్నారు. మూడు రోజుల కిందట బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లికి చెందిన విద్యార్థి సత్తిబాబు జ్వరంతో ఫిట్స్ వచ్చి తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. అతడిని రాజేంద్రపాలెం ఆస్పత్రి నుంచి నర్సీపట్నం, అక్కడ నుంచి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించిన విషయం విదితమే. ప్రస్తుతం విద్యార్థి సత్తిబాబు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

పీహెచ్‌సీకు ఇద్దరు డాక్టర్ల నియామకం



లాగరాయి పీహెచ్‌సీలో విధుల్లో చేరిన వైద్యాధికారులు సతీష్, శరత్ చంద్ర

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి ఇద్దరు వైద్యుల నియామకం జరగ్గా, వారు బుధవారం విధుల్లో చేరారు. లోతట్టు ప్రాంతంలో గల ఈ ఆస్పత్రికి ఇరువురు వైద్యులను నియమించాలని స్థానిక గిరిజన ప్రతినిధులు అధికారులను విన్నవించుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డాక్టర్ ఎం.సతీష్, డాక్టర్ శరత్ చంద్రలను ప్రభుత్వం కొత్తగా నియమించింది. ఈ మేరకు వారు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు ఎప్పుడు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణే తమ ధ్యేయమన్నారు.

నాగులాపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా



ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి

మునగపాక: నాగులాపల్లిలో ప్రభుత్వం భూమి ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో పంచాయతీ స్థలంలో షాపుల నిర్మాణం చేపట్టారు. ఈ షాపుల ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుంది. ఈ షాపుల వెనక గ్రామానికి సంబంధించిన ప్రధాన డ్రైనేజీ ఉంది. గ్రామంలో మురుగునీరంతా ఈ కాలువ గుండా ప్రవహించి పక్కనే ఉన్న సాగునీటి కాలువలో కలుస్తుంది. ఈ కాలువ నిర్వహణ కోసం గత సర్పంచ్ యల్లపు భాస్కరరావు కొంత స్థలాన్ని విడిచిపెట్టారు. ఈ స్థలంపై గ్రామానికి చెందిన సతీష్ కన్నుపడింది. రాత్రికి రాత్రే పునాదులు లేచిపోయాయి. కాలువ నిర్వహణ కోసం గతంలో కొంత స్థలాన్ని వదిలేస్తే సంబంధిత స్థలంలో నిర్మాణాలు చేపట్టడం తగదంటూ భాస్కరరావు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి సంబంధించిన స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు కూడా కనీసం పట్టించుకోలేదంటూ స్థానికులు మండిపడుతున్నారు. పంచాయతీ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కర్రిముఖిపుట్టు మార్గంలో గోతులతో పాడైన రహదారి



కుమ్మరివీధి గ్రామంలో కోతకు గురైన కల్వర్టు

సమస్యలతో సతమతం

- శిథిలావస్థకు చేరిన కుమ్మరివీధి కల్వర్టు
- రాకపోకలకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



సలుగు సచివాలయం

పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీ సరియాపల్లి, కుమ్మరివీధి గ్రామాల మధ్యలో కల్వర్టు వర్షలకు రంధ్రాలు ఏర్పడి కోతకు గురైయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు దెబ్బతిందని చెబుతున్నారు. పెదబయలు మండలం కేంద్రానికి, పాడేరు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. దీంతో పాటు మండలంలోని గోమంగి, గుల్లేలు, పోయిపల్లి, గిన్నెలకోట, ఇంజరి.లింగేటి, బొంగరం, కుంతుర్ల ప్రజలతో పాటుగా జి.మాడుగుల మండలాల సరిహద్దు పంచాయతీ ప్రజలకు ఇదే రోడ్డు మీదుగా జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు.ప్రతీ రోజు వందల వాహనాలు వెళ్లే ఈ రహదారిపై కల్వర్టు శిథిలావస్థకు చేరి ఏడాది గడుస్తున్నా అధికారులు స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. కల్వర్టు దెబ్బతినడంతో పలు ప్రమాదాల్లో వాహనచోదకులు గాయాలపాలయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గోతుల దారితో అవస్థలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి కర్రిముఖిపుట్టు వెళ్లే మార్గంలో ఫారెస్టు కార్యాలయం సమీపంలో పి.ఆర్.రోడ్డు గోతులమయంగా మారింది. ఈ మార్గంలో పెద్ద పెద్ద గోతులున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గోతుల్లో వర్షపు నీరు భారీగా చేరింది. వాహనదారులకు ఇబ్బందిగా మారింది. గత కొన్ని నెలలుగా గోతులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులలో స్పందన కరువైయింది. ప్రతి రోజు ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతూ రాకపోకలు చేస్తున్నారు. గోతుల్లో పడి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడినట్టు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

స్తంభించిన సెల్ సిగ్నల్ వ్యవస్థతో సతమతం

పాడేరు రూరల్: మండలంలో మారుమూల సలుగు పంచాయతీలో సెల్ సిగ్నల్‌తో పాటు నెట్‌వర్క్ సమస్య తీవ్రంగా స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ పరిధిలోని సుమారు 32 గ్రామాలు ఉన్నాయని చెబుతున్నారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు వివిధ ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పొందే పనులకు తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు.

మారుమూల పంచాయతీ కావడంతో సెల్ సిగ్నల్, నెట్ వర్క్ సౌకర్యం లేక గత్యంతరం లేక పాడేరు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామ సచివాలయ భవనం, సెల్ టవర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆయా పనులపై కనీసం దృష్టి సారించడం లేదంటున్నారు. సెల్ సిగ్నల్ వ్యవస్థ స్తంభించడంతో అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సీఐ హిమగిరి బుధవారం సందర్శించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనశైలి కోసం గంజాయి, పొగాకు, వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, పొగాకు, వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. ప్రతి విద్యార్థి వ్యసనాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలకు అనుగుణంగా నడిచి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆయన సూచించారు. హెచ్‌ఎం గెన్ను, పాఠశాల నిర్వాహకుడు రాంబాబు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేట ప్రధాన రహదారి బిజ్జపల్లి మలుపు వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదస్థాయికి చేరాయి. దీనిపై ఇటీవల 'సాక్షి'లో 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పాత స్తంభాలు తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు. రాతులపుట్టు, కామయ్యపేట గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.

రైతులకు సూచనలు



గాడిదలమెట్టలో రైతులకు సూచనలిస్తున్న ఏడీ తిరుమలరావు, ఏవో మధుసూదనరావు

చింతపల్లి: గిరిజన రైతులు వేరుశనగ పంటలో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని చింతపల్లి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వి. తిరుమలరావు అన్నారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని గాడిదలమెట్ట గ్రామంలో మండల వ్యవసాయ అధికారి మధుసూదనరావుతో కలసి పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో మంచి దిగుబడికి వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలన్నారు. పొలం గట్లపై కంది మొక్కలు పెంపకం చేయడంతో అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. వీహెచ్‌ఎ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు : తండ్రి మృతితో మనోవేదనతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త గబ్బాడ రాజారావును బుధవారం పాడేరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. మండలంలోని కుజ్జెలి గ్రామంలో అతడి ఇంటికి వెళ్లి రాజారావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కుంతూరు నర్సింహమూర్తి తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



దుకాణదారులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని దుకాణాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే ఫైన్‌తో పాటు చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన బుధవారం సందర్శించి, పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. దుకాణదారులతో మాట్లాడుతూ డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం డుంబ్రిగుడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త చెదారాలను తడి, పొడి చెత్త బుట్టల్లో వేయాలని సూచించారు. డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య నిర్వాహణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ వెంకటరావు, వైస్ సర్పంచ్ జగ్గునాయుడు, ఈవోఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి గౌతమి, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు భవనం మంజూరు చేయండి



పాఠశాల భవనం మంజూరు చేయాలని కోరుతున్న సారది గ్రామస్తులు, విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీలో సారది గ్రామంలో ఎంపీపీ పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని కోరుతూ బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సారధి గ్రామస్తులు సత్యారావు, సన్యాసిరావు, నీలకంఠం, మోదొనోలు మాట్లాడుతూ పాఠశాలకు పక్కా భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రేకుల షెడ్డు కారిపోతూ, పిల్లలు ఉండేందుకు నానా అవస్థలు పడుతున్నారన్నారు. పాఠశాలలో 19 మంది విద్యార్థులు చదువు కోసం ప్రతి రోజు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాఠశాల భవనం శిథిలావస్థ పేరుతో విద్యాశాఖ అధికారులు కూల్చివేశారని, నేటికి నూతన భవనం మంజూరు మాత్రం చేయలేదన్నారు.గ్రామస్తులంతా శ్రమదానంతో రేకుల షెడ్డును నిర్మించుకున్నామని వారు చెప్పారు. పాఠశాల భవనం కోసం అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన స్పందన కరువైయిందని, తక్షణమే తమ పిల్లల ఇబ్బందులు గుర్తించి, నూతన భవనం మంజూరు చేసి భవన కష్టాలు తీర్చాలని వారు కోరారు.

యంత్రాలతో వరినాట్లపై అవగాహన



పెదనందిపల్లిలో రైతులకు యంత్రంతో నాట్లు వేసే పద్ధతిపై అవగాహన కల్పిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: యంత్రం సహాయంతో వరినాట్లు వేయడం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ అన్నారు. పెదనందిపల్లిలో గ్రామానికి చెందిన కళింకోట శంకర్, చిత్రాడ జగదీశ్వరరావు రైతు పొలాల్లో యంత్రం సహాయంతో నాట్లు వేయించి స్థానిక రైతులకు, వ్యవసాయ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. యంత్రంతో నాట్లు వేయడం ద్వారా క్రమ పద్ధతిలో మొక్కలు పడతాయని, తద్వారా గాలి వెలుతురు బాగా తగిలి పంట ఏపుగా ఎదుగుతుందన్నారు. పంట తెగుళ్ల బారిన పడకుండా రక్షించుకోవచ్చునని రైతులకు వివరించారు. మండలంలోని బోయిలకింతాడ, పెదనందిపల్లి, వేచలం, మామిడిపల్లి, ఏ. కొత్తపల్లి, కలిగొట్ల గ్రామాలలో 150 ఎకరాల్లో నాట్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. యంత్రం ద్వారా నాట్లు వేసేందుకు ఎకరానికి రూ. 4,500 మేర ఖర్చు అవుతుందని, రోజుకు 5నుంచి 6 ఎకరాలకు వరకు నాట్లు వేసుకోవచ్చునని ఏవో కాంతమ్మ రైతులకు తెలియజేశారు.

మోదమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే మోదమాంబ అమ్మవారి జాతరకు హాజరు కావాలని జాతర ఉత్సవ కమిటీ వారు మాజీ ఏమ్మెల్యే, యలమంచిలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీని బుధవారం ఆహ్వానించారు. ఈ మేరకు ఆయనను గాజువాకలో ఆయన స్వగృహం వద్ద కలిసి ఆయన చేత జాతర గోడపత్రికను విడుదల చేశారు.

ఉత్సవ కమిటీ చైర్మన్ రాపేట జోగినాయుడు, కమిటీ వైస్ చైర్మన్ రాపేట రాజశేఖర్ నాయుడు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శరగడంఆదిబాబుతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జి కాళ్ల నర్సింగరాజు, ఆడారి బలరామ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ



దేరల గ్రామంలో విద్యార్థులకు పంపిణీ చేసిన వస్తువులతో దాత సత్యనారాయణ



తూండ్రుంగుడలో విద్యార్థులకు స్టీల్ కంచాలను అందజేస్తున్న దాత, ఉపాధ్యాయులు

గూడెంకొత్తవీధి: విద్యతోనే పేదరికం జయించగలమని గూడెంకొత్తవీధి రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను విధిగా పాఠశాలలకు పంపాలని కోరారు. ఆయన దేరల పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, అట్టలు, కాంపస్ బాక్స్‌లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ప్రాముఖ్యతను వివరించారు. హెచ్‌ఎం దొండా కాశేశ్వరరావు, వీఆర్‌వో టి.వెంకటేశ్వర్లు, ఎం.విజయ్ తదితరులు పాల్గొన్నారు

డుంబ్రిగుడ: మండలంలోని తూండ్రుంగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రేమబంధు ఫౌండేషన్ ప్రతినిధి రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టీల్ కంచాలను వితరణగా అందించారు. ఆ పాఠశాల హెచ్‌ఎం శెట్టి బాలకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ సేవలను కొనియాడారు. గ్రామాల్లో పేద విద్యార్థులకు మరిన్ని సేవలు అందించాలని కోరారు. తమ పాఠశాలకు కంచాలను అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుడు శ్రీను, ఎస్‌ఎంసీ చైర్మన్ సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీమాతో రైతులకు మేలు



హెచ్‌వో శిరీష

అరకులోయటౌన్: పసుపు పండించే రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా నమోదు చేసుకోవాలని హెచ్‌వో కె.శిరీష అన్నారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. తుపానులు, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట దిగుబడి తగ్గి నష్టపోయినప్పుడు రైతులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతున్నారు. వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచన వేసి బీమా పరిహారం అందుతున్నారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులన్నారు. పసుపు పండించే రైతులు ఎకరానికి రూ.1336 చెల్లిస్తే రూ. 89,069 బీమా, హెక్టారుకు రూ. 3వ,300 చెల్లిస్తే రూ. 2.22లక్షల బీమా వర్తిస్తుందన్నారు. బీమాతో రైతులు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ బీమా పథకం నమోదు గడవు ఈనెల 31తో ముగుస్తుందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిరీషా కోరారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు టాన్యా

రంపచోడవరం: విద్యుత్ వినియోగదారులకు డిస్కంలు ఏర్పాటుచేస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని అఖిల పక్ష రాజకీయ పార్టీల పిలుపులో భాగంగా రంపచోడవరంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా, ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య, జిల్లా నాయకుడు పల్లాల లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులపై మోపిన ట్రూఅప్, ఎఫ్‌పీపీ భారాలను రద్దు చేయాలని, అదాని స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దూలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న జెన్‌కో నుంచి విద్యుత్ తీసుకోకుండా ప్రైవేట్ సంస్థల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేస్తూ ప్రజలనెత్తిన భారం మోపుతున్నారని ఆరోపించారు.

పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి



గొండుపాలెంలో పశువులకు టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు : థైలేరియా వ్యాధి బారిన పశువులు పడకుండా రైతులు ముందస్తుగా టీకాలను వేయించాలని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. గొండుపాలెం గ్రామంలో బుధవారం నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ వ్యాధి బారిన పడిన పశువుల తీవ్రమైన జ్వరంతో బలహీనపడతాయని, తద్వారా పాల దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ వ్యాధి సోకకుండా రైతులు తమ పశువులకు ఉచిత టీకాలు వేయించా లని సూచించారు. చౌడువాడ పశువైద్యాధికారి సిహెచ్. వై.నాయుడు, సిబ్బంది సమీరా, ప్రవీణ్ పాల్గొన్నారు.

సంతోషిమాత దేవస్థానంలో 21న వేలం పాట

అనకాపల్లి: గవరపాలెం సంతోషిమాత దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, రవికలు పొందడం కోసం ఈ నెల 21న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఆగస్టు నెల 31వ తేదీ వరకూ ఆలయంలో చీరలు, రవికలు పొందుటకు లైసెన్స్ ఇచ్చేందుకు వేలం వేస్తున్నట్టు పేర్కొన్నారు. భక్తులు సమర్పించిన కొబ్బరి ముక్కలు పోగుచేసుకునే లైసెన్స్ హక్కును ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24 వరకూ ఒక నెల రోజుల పాటు బహిరంగ వేలం వేస్తున్నట్టు తెలిపారు.


శాస్త్ర సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన



ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న రాము

మాకవరపాలెం : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పి) ద్వారా శాస్త్ర సాంకేతికతపై ఉపాధ్యాయుడు కె.రాము విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా 18 రోజులపాటు అంతరిక్షంలో ఉండి భూమిపైకి తిరిగి వచ్చిన శుభాన్షు శుక్లాకు సంబంధించిన వీడియోను విద్యార్థులకు చూపించారు. మరలా 2027లో భారతదేశం నుంచి గగన్‌యాన్ మిషన్‌లో శుభాన్షు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లనున్నట్టు తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి శాస్త్ర సాంకేతికతపై తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా బోధన చేస్తున్నట్టు రాము తెలియజేశారు. కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల సత్వర పరిష్కారం



మీడియేషన్‌పై న్యాయమూర్తి షియాజ్ ఖాన్ ఆధ్వర్యంలో ర్యాలీ

నర్సీపట్నం: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చునని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా న్యాయమూర్తి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో మధ్యవర్తిత్వం అందుబాటులోకి వచ్చిందన్నారు. 2023లో మీడియేషన్‌పై చట్టం చేశారన్నారు. ప్రత్యేకంగా ఆరుగురు న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారన్నారు. కక్షిదారులు రాజీమార్గంలో కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు మీడియేషన్ దోహదపడుతుందన్నారు. ఈ ర్యాలీలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com